# అక్క పెద్దరికం

"ఆ సావిత్రి ఇవాళ భోజనం చెయ్యలేదు. పొద్దున కాఫీ తాగలేదు. పిల్లలకు మాత్రం అన్నం పెట్టింది. ఎంతసేపో బతిమిలాడాను నాన్నా. అంతకంటే నేనేం చెయ్యను?'' విసుక్కుంటూ చెప్పింది రంగనాయకి తండ్రితో.

"అతడింట్లో ఉన్నాడా?'' ప్రశ్నించాడు జగన్నాధరావు.

''లేదు నిన్ననే ఊరికెళ్లాడు.''

''అయితే దాని పట్టుదల అట్లాగే ఉందన్నమాట. ఉపవాసాలు చేస్తూ ఇక్కడ ఉండటమెందుకు? బట్టలు సర్దుకోమను. మధ్యాహ్నం రైల్లో వెళ్లమను. ఆ పల్లెటూళ్లో ఆ పాతయింట్లో పిల్లలతో ఎట్లా కాపరం చేస్తుందని ఇక్కడే ఉండమన్నాను. పిల్లలకు చదువూ అబ్బుతుంది. తనూ సుఖంగా నలుగురితో ఉండచ్చనని రంగారావుతోకూడా చెప్పాను. అయినా వెల్తానని సావిత్రి పట్టుబడితే వెళ్ళమను'' అన్నాడు జగన్నాధరావు.

జగన్నాధరావు ఒకకాలంలో జాగీర్దారుకాదు గాని అంతటి సంపన్నుడు. ఐదుగురు కూతుళ్ళ తరువాత ఆరవకాన్పు సవ్యంగా జరగలేదు. తల్లీబిడ్డలిద్దరూ చనిపోయారు. ఆ చనిపోయిన బిడ్డ మగబిడ్డ. ఆ మగబిడ్డయినా బ్రతుకకూడదా అని కొంతకాలం ఆయన బాధపడ్డ మాట నిజమే. అందరూ ఆడపిల్లలు. తమ యింటిపేరు నిలబెట్టగలవారెవరూలేరు. ఈ విచారంతో కొన్ని సంవత్సరాలు క్రుంగిపోయాడు.

భార్యచనిపోయిన పదిసంవత్సరాలకాలంలో ఇల్లు చక్కపెట్టటం, మంచీ చెడ్డ చూడటం, పెద్దకూతురిమీద వదలిపెట్టాడు. పెద్దఅల్లుడూ పెద్దకూతురూ అలా ఇంటి సంగతులు ఒకరూ, బైటి సంగతులు ఒకరూ చూస్తున్నారు.

"అతడుకూడా ఇక్కడుంటే లాభమని ఆశపడ్డాను. అతడు చదువుకోవా

లనుకుంటే పెద్దచదువులు ఇక్కడే చదువుకోటానికి అవకాశాలున్నాయికదా అనుకున్నాను. లేకపోతే ఆ కొద్ది జీతంలో పిల్లలతో నలిగిపోతుందని బాధపడుతూ చెప్పాను.''

సావిత్రి ఆ మాటలు ఎవరూ చెప్పకుండానే విన్నది. పిల్లలవీ తనవీ బట్టలు సర్దుకుంది. నౌకరుతో ఆటో తెప్పించుకుని అక్కచెల్లెళ్ళతో చెప్పి బయలుదేరింది.

సావిత్రి వెళ్తానని చెప్పినప్పుడు అందరూ విని ఊరుకున్నారు.

"వెళ్లేటప్పుడు కొత్తబట్టలు తెప్పించుదామనుకున్నాను. వ్యవధికూడాలేదు. బజారుకి పంపిద్దామంటే. ఆయన సాయంత్రానికిగాని రారు." అంది పెదముఖం పెట్టుకుని రంగనాయకి.

తన ప్రయాణంసంగతి నాలుగురోజులనుంచీ అనుకుంటున్నమాటే. బట్టలు తెప్పించాలనుకుంటే నిన్ననే తెప్పించేది. అయినా ఆ సంగతి అంతగా పట్టించుకోకుండా సావిత్రి స్టేషన్‌కి చేరుకుంది. మధ్యాహ్నం ఒంటిగంటకు బయలుదేరితే సాయంత్రం చీకటిపడేవేళకు ఊరు చేరుకుంటుంది. పిల్లలకు దారిలో తినటానికి ఏమయినా ఇంట్లో చేయించుకోవాలనుకుంది. కాని-'పళ్లు కొనిపెట్టచ్చులే' అనుకుంది.

మొదట అనుకున్నట్టుగా రంగారావు స్టేషన్‌కి వచ్చాడు. ఇంటికి వెళ్ళగానే పిల్లలు ఆకలికి ఆగలేక ఏడుస్తారు. పడుకునేవేళ కొత్తగా ఇంట్లో అడుగు పెడుతూనే అన్ని వస్తువులూ వెతుక్కుని సావిత్రి వంటచెయ్యలేదు. అందుకని తనే వంటచేసి సిద్ధంగా ఉంచాడు.

''సావిత్రీ పిల్లలకు అన్నంపెట్టు. ఆ గదిలో పక్కలువేశాను. పడుకోబెట్టు. అంతలోపల ఒకగంటసేపు బయటికి వెళ్ళివస్తాను. ఒక స్నేహితుడిని కలుసుకోవాలి" అంటూ వెళ్ళాడు.

వెంటనే సావిత్రి పిల్లలకు ముఖాలు కాళ్లూచేతులూ కడిగి భోజనంపెట్టింది. వాళ్ళను పడుకోబెట్టటానికి అతడు చూపించిన గదిలోకి తీసుకువెళ్ళింది. అక్కడ రెండుమంచాలమీద పక్కలువేసి ఉన్నాయి. వాళ్లను పడుకోబెట్టి, పక్కగదిలోకి తొంగిచూసింది. దానిలోకూడా మంచాలమీద పక్కలువేసి ఉన్నాయి.

విస్మయంతో అతడు వచ్చేలోపల ఇల్లంతా తిరిగి చూసింది. రెండుపడగ్గదులూ, వాటిముందర కుర్చీలు వేసిన గదీ ఉన్నాయి. ఆ గదులముందర ఒక హాలు ఉన్నది ఇంటిసైజుకు తగినట్టుగా. ఇవి దాటుతూ పెరటిముఖంగా వెళ్లితే వంటయిల్లూ భోజనాల గదీ పక్కపక్కనే ఉన్నాయి. భోజనాల గదిలో ఒకబల్ల నాలుగు కుర్చీలూ, వంటయింట్లో అల్మేరాలలో పప్పు ఉప్పు సామాను ఒకదాంట్లో, గ్లాసులూ పళ్ళేలూ ఒకదాంట్లో సర్దిఉన్నాయి.

తమకు నలుగురికీ కావలసిన వంటపాత్రలు ఉన్నాయి.

అతడు ఇంకారాలేదు. అంతలో ఇంటిచుట్టూ ఉన్న కొద్ది స్థలాన్ని, అక్కడే వేసిన వెనకవైపు కొబ్బరి నిమ్మ కరిలేపాకు చెట్లనూ, ముందువైపు వేసిన పూల చెట్లనూ సందులో పందిరివేసిన మల్లెచెట్టునూ చూసివచ్చింది. చుట్టూ ప్రహరీగోడ-దానికొక కర్రగేటును చూసింది.

'ఇద్దరు పిల్లలకూ మాకూ ఈ ఇల్లు చాలదా ఏమిటి? అనుకుంది. అయినా ఇంతకంటె పెద్దది ఎందుకూ?' అన్నభావంకూడా ద్యోతకమయింది.

అతడికి అలవెన్సులతో కలుపుకుని రెండువేలపైన జీతం వస్తుంది. జాగ్రత్తగా గడుపుకుంటే కొద్దిగా మిగల్చవచ్చు.

రంగారావుకు రైల్వేలో ఉద్యోగం టికెట్ కలెక్టరు పైస్థాయిలో ఉన్నాడు. అతడికి ఐదేళ్ల సర్వీసు ఇంకా పూర్తికాలేదు. రావలసిన ప్రమోషన్లు ముందర ఉన్నాయి. కుటుంబసహితంగా అతడు రెండవతరగతి ఎయిర్ కండిషన్డు కంపార్టుమెంటులో దేశమంతా ప్రయాణం చేయవచ్చు. మనదేశంలో ఇన్నిసౌకర్యాలు గలవాళ్ళు గొప్పవాళ్లనుకోవచ్చు.

జగన్నాధరావు కూతుళ్ళు ఐదుగురిలో రంగనాయకి పెద్దది. ఆమె తల్లి ఉన్నప్పటినుంచీ చెల్లెళ్లకు తలలు దువ్వి బట్టలువేయటం, తల్లిచెప్పిన చిన్నచిన్న పనులు చేయటం అలవాటయింది. పిల్లలను స్కూళ్లకు పంపించేది. తల్లి చనిపోయేనాటికి ఇంటర్ మీడియట్ చదువుతున్నది. ఆమె పోవటంతో చదువుమాని ఇంటి యాజమాన్యం వహించవలసివచ్చింది. రెండవ అమ్మాయి సుందరి. చదువు మీద అంతగా ధ్యాసలేదు. మెల్లగా ఒకో క్లాసు రెండేసి ఏళ్ళు చదువుతూ ఉంటుంది. అందుకని ఆమెకు వయసురాగానే పెళ్ళిచేశారు. భర్తతో తండ్రి యింట్లోనే ఉంటోంది.

మూడవ అమ్మాయి సావిత్రి. ఆమె స్కూల్లో చదివేటప్పుడు సంగీతం కూడా చెప్పేవారు. కాలేజి చదువుకు వచ్చినప్పుడు ప్రత్యేకంగా తండ్రితో చెప్పి ఆ మాష్టరు వద్దనే ఇంట్లో ఏర్పాటు చేసుకుని సంగీతాన్ని వృద్ధిచేసుకుని ప్రావీణ్యతను సంపాదించింది. బి.ఏ. పరీక్ష రాసింది. ఆమె తరువాత పిల్లలిద్దరూ చిన్నవాళ్లు. హైస్కూలులో ఉన్నారు.

జగన్నాథరావుకి ప్రత్యేకించి కొత్త ఆశలూ ఆలోచనలూ ఆశయాలూ లేవు. అందరూ ఆడపిల్లలు కనుక కాలానికీ, తన స్థాయికే తగినచదువు చెప్పించి పెళ్ళిళ్ళు చేసెయ్యటమే ఆయన ధ్యేయం. ఆ పిల్లలను గారాబంగా పెంచాడు గనుక వాళ్ళకు పెళ్ళిళ్ళుచేసి కూతుళ్ళను అల్లుళ్లతో తన యింట్లోనే ఉంచుకోవాలన్న ఉద్దేశ్యం ఉంది. ఇల్లు పెద్దది. నలుగురయిదుగురు నౌకర్లున్నారు. మనమలను కూడా చూస్తారు.

ఐదుగురమ్మాయిలలో పెద్దదైన రంగనాయకి అందంలో సామాన్యంగా ఉంటుంది. తెలివితేటలలో లౌకికజ్ఞానం ఎక్కువ. స్వార్థం మాటల్లో చేతుల్లో ఎక్కువగా పైకి కనబడనీయదు. మూడవది సావిత్రి. పిల్లలందరిలోకి వివేకమూ అభిమానమూ రవంత అధికంగా ఆమెలో ఇమిడి ఉన్నాయి. ఒకరిని ఒకమాట అనదు. తనొకమాట పడదు. ఆమె తన చదువూ సంగీతం తప్ప మరేమీ అంటించుకోదు.

రంగనాయకికి సావిత్రి తనకంటె ఏ విషయంలోనూ మించటం మనసులో ఇష్టంలేదు. తండ్రితో సావిత్రిని ఎక్కువగా మాట్లాడనిచ్చేదికాదు. తండ్రితో మాట్లాడాలని సావిత్రి వెళ్ళుతుంటే వెనక్కి పిలిచి "ఆయనకు ఆ పార్టీలతోనే తలనొప్పిగా ఉంది. మీరుకూడా వెళ్ళి గొడవ చేయకండి' అని లోపలికి తీసుకుపోయేది. తన పెద్దరికాన్ని వీసమంతయినా తగ్గకుండా చూసుకునేది.

"నాన్నా! సావిత్రికి చదువు చెప్పించటం దండుగ. పైగా సంగీతం మాష్టర్ని కూడా పెట్టేవు. కాలేజిలో బాగా చదువుతున్నట్టుగా మంచి రిపోర్టుకూడా రావటంలేదు. దానికికూడా ఏదయినా సంబంధం చూడమని చెప్పు. చిన్నపిల్లలిద్దరూ కాలేజీ చదువుకు వచ్చినప్పుడు చూద్దాం" అన్నది రంగనాయకి.

రంగనాయకికి తండ్రి తనను ఇంటికి పెద్దగా చేసినప్పటినుంచీ తనూ

తన కూతురు మహిమ సంగతులు బాగా చూసుకునేది. మహిమను మామూలు స్కూల్లో వెయ్యలేదు. ధనవంతులు చదువుకునే స్కూల్లో చేర్పించింది. చెల్లెళ్ళు బస్సులోనే వెళ్తారు. మహిమనుమాత్రం కారులో పంపిస్తుంది. నౌకరుచేత భోజనం పంపిస్తుంది. పిల్లలందరికంటె ఆ అమ్మాయికి అన్నీ ప్రత్యేకమయిన సదుపాయాలు కల్పిస్తుంది.

ఈ కారణంచేత పిల్లలు అక్కతో అప్పుడప్పుడు "అన్నీ మహిమకేనా?'' అని కోపం తెచ్చుకుంటారు. రంగనాయకి వాటినన్నిటినీ తెలివిగా సర్దేది.

రంగనాయకి భర్త సురేంద్ర రెవిన్యూ డిపార్టుమెంటులో యు. డి. సి. గా పనిచేస్తాడు. అతడు సామాన్యకుటుంబంలోనుంచి వచ్చాడు. జగన్నాధరావుకి అతడి వినయవిధేయతలు మాటతరహా అంతానచ్చింది. రంగనాయకికంటె చూడటానికి బాగుంటాడు. ఆమె కూడా అందుకే పెళ్ళికి మొగ్గింది. పెరుగుతున్న కొద్దీ తండ్రియింట్లో పరిస్థితులు ఒక్కొక్కటీ తనచేతిలో ఇముడ్చుకోవటం మొదలుపెట్టింది. ఆమె మనసులో మహిమ పుట్టినప్పటినుంచి స్వార్ధము అదివరకూ కంటే పదిరెట్లు పెరిగింది.

''అక్కా. మాకు ఈ పండక్కు మంచిరకం కొత్తబట్టలు కుట్టించాలి'' అని చెల్లెళ్ల అనగానే ఆమె ''ప్రతి పండక్కూ కొత్తబట్టలు వేసుకోవాలన్న రూలు ఏమయినా ఉందా ? అయినా కుట్టిస్తునే ఉన్నాగా ? పండగ ఇంకా ఇరవై రోజులుంది కుట్టిస్తాలెండి'' అని సర్దిచెప్పేది.

కాని రెండు మూడు రోజుల్లోనే మహిమకు ఖరీదయిన బట్టకొని కొత్త నమోనాలో ఎక్కువ కూలిఇచ్చి కుట్టించేది. చెల్లెళ్ళకు మామూలు బట్టలుకొని తమ యింటిదగ్గరున్న టైలరుతో కుట్టించేది.

పండగనాడు కొత్తబట్టలు వేసుకున్నప్పుడు చెల్లెళ్లకు ఈ తేడా తెలిసేది. వెంటనే పేచీ పెట్టేవారు.

"మహిమకు మంచి ఖరీదయిన అందమైన గౌను కుట్టించావు. మాకు ఇటువంటి బట్టలా కుట్టించావు ? మేము వేసుకోము'' పేచీపెట్టేవారు.

"ఎప్పుడూ మహిమకు నేనేదో ఖరీదుగల బట్టలు కుట్టించానని ఏడుస్తారేం?

మహిమకు వాళ్లనాన్న బట్టకొని కుట్టించాడు. నాన్న మీకు ఇవి చాల్లే అన్నాడు'' అనేది వాళ్లతో.

పాపం వాళ్లకు తండ్రిదగ్గరికెళ్ళి అక్క చేసినవన్నీ చెప్పాలని తెలియదు. తగిన ధైర్యంకూడాలేదు. రోజు ఏడ్చేవారు. మహిమను చూసి దగ్గరికి పిలిచే వారు కారు. ఆమెమీద అసూయవంటిది కలగటం మొదలుపెట్టింది.

సురేంద్ర తనజీతం తన ఖర్చులకిందయినా ఖర్చుపెట్టేవాడుకాడు. అతడు ఆ యింటి అల్లుడయినప్పటినుంచీ పరిస్థితులను త్వరలోనే గ్రహించేశాడు. ఆఫీసుకు రాకపోకలు ఏదోవిధంగా వీలుచేసుకుని కారులోనే వెళ్లేవాడు. ప్రతి పండగకూ రెండేసి జతల బట్టలు కుట్టించుకోవటానికి ''నాన్న ఇమ్మన్నారని'' రంగ నాయకి ఇచ్చేది. ఇంటి ఖర్చులకోసం తండ్రియిచ్చిన డబ్బులో ఈ ఖర్చులు పెట్టేది.

''అన్నివస్తువులూ ప్రియమైపోయాయినాన్నా. నీవిచ్చేడబ్బు చాలటంలేదు. మొన్న సామాను తెప్పించటానికి దుకాణంలో అప్పుచేయవలసి వచ్చింది" అని ఇంటి కష్టసుఖాలు చెబుతూ ఈ మాట చివరకనేది.

"అవునమ్మా. అవును. డబ్బుకొంచెం ఎక్కువ తీసుకో గాని సామాను జాగ్రత్తగా వాడమనిచెప్పు నౌకర్లకు"అన్నాడు.

''అలాగే చేస్తున్నాను నాన్నా. నేను ఒక నిమిషమయినా ఊరికే కూర్చోను. ఇంటిసంగతే ఆలోచిస్తూ ఉంటాను. ఎంత తగ్గిద్దామన్నా కుదరటంలేదు. మొదట నుంచీ బాగా అలవాటయిన పిల్లలు మొన్న ఖరీదుగల బట్టలు కావాలని గోల పెట్టారు. ఏంచెయ్యను ? వాళ్లమాటప్రకారం బజారుకి తీసుకువెళ్ళి వాళ్ళుకోరిన బట్టలు కుట్టించాను" అన్నది.

''వాళ్లకు తెలియదుకదమ్మా, ఇంకా చిన్నవాళ్లు. ఏళ్ళుపైన బడుతున్న కొద్దీ వాళ్ళే తెలుసుకుంటారు.''

''ఒక్కసారే తెలుసుకొమ్మంటే తెలుసుకోరు. వాళ్లు నీకంటికి చిన్న పిల్లలుగా ఉన్నారుగాని పెళ్ళీడు వచ్చింది. వాళ్ళు బి. ఏ. దాటుతారన్న నమ్మకం నాకు కుదరటంలేదు. పెళ్ళిళ్ళు చేసెయ్యి. ఇద్దరికీ ఒకసారి చెయ్యటం మన ఇళ్లల్లో ఆచారంగా వస్తునేఉంది'' అంది.

"మన పెద్ద గుమాస్తాకుచెప్పు. అతడు అన్ని ఆలోచించి చూస్తాడు. అల్లుళ్ళకూడా ఇక్కడే ఉండాలని చెప్పమను" అన్నాడు.

రంగనాయకి భర్త సురేంద్ర ఇంటికి పెద్ద అల్లుడు కనుక ఇంటి యాజమాన్యంలో అతడూ జోక్యం కలిగించుకునేవాడు. తన జీతంతో బ్యాంకి డిపాజిట్లు తీసుకోవటం, భార్య అందిస్తున్న డబ్బుతో షేర్లుకొనటం అమ్మటం చేస్తూ ఉండేవాడు. అతడిగది మేడమీద ప్రత్యేకంగా ఉంది. గదంతా కొత్తరకం సామాన్లతో నింపేవాడు. మిగతా అల్లుళ్ళకు వరసగా కిందగదులున్నాయి. కాని ప్రస్తుతం ఇంట్లో ఉన్నది రెండవ అల్లుడు ఒక్కడే.

జగన్నాధరావు మొదట హైకోర్టువకీలుగా ప్రాక్టీసుచేసేవాడు. వయసు పైనబడుతున్నకొద్దీ ప్రాక్టీసు తగ్గుతూ వస్తున్నది. ధనికుడు కనుక అంతగా పట్టించుకోవటంలేదు.

గుమస్తాతో చెప్పినట్టుగా, ఆయన ఊళ్ళన్నీ తిరిగి కొద్ది చదువులతో ఇళ్లు గడపలేని స్థితిలో ఉన్న కుటుంబాలలో పుట్టిన వారినీ, గొప్పవారింట ఇల్లరికం ఉన్నా అభ్యంతరంలేని వాళ్లనూ ఇద్దరిని చూసి పెళ్ళిచూపులకు తీసుకువచ్చాడు. వాళ్ల పరిస్థితులను జగన్నాధరావుకు విప్పిచెప్పాడు.

పల్లెటూరి పిల్లలయినా బస్తీ షోకులు చేసుకుని వచ్చారు. పిల్లలిద్దరూ చూడటానికి బాగానే ఉన్నారు. అమ్మాయిలకంటె చదువుకాస్త తక్కువయినా ఈడూ జోడూ బాగా కుదిరినట్లున్నాయి.

మంచి ముహూర్తంచూసి రెండు పెళ్ళిళ్లు ఒకగంట తేడాలోచేశారు. బంధుమిత్రులు వచ్చి దీవించి కట్నాలు తీసుకువెళ్లారు.

పెద్దఅల్లుడు సురేంద్ర ఆయన కూతురు మహిమ ఇద్దరూ ఉదయం తొమ్మిది అవుతుండగా కారులో వెళ్ళిపోయేవారు. పరీక్షలయేవరకూ కాలేజిలో చదివే ఇద్దరు కూతుళ్లూ బస్సులో అయిదునిమిషాల తరువాత బయలుదేరి వెళ్లేవారు.

ఆయింట్లో ముగ్గురల్లుళ్ళకూ ఒకసారి భోజనాలయ్యేవి. జగన్నాధరావు పన్నెండు గంటలకు గాని భోజనంచేసేవాడుకాదు. సెక్రెటేరియట్‌కి ఆదర్శనగర్‌లో ఉన్నఇల్లు దగ్గరే అయినా పెద్దఅల్లుడు సురేంద్ర కారులోనే భోజ

నానికి ఇంటికి వచ్చేవాడు. మామగారి భోజనమయిన తరువాత భార్యతో భోజనం చేసేవాడు. భోజనంలోకూడా ముగ్గురు కూతుళ్లకు, అల్లుళ్ళకూ వంటవేరేగా ఉండేది.

రంగనాయకి చెల్లెళ్లలో ఒక్క సావిత్రి తప్ప మిగతావాళ్ళంతా అంతంత మాత్రంగానే తెలివితేటలలో గాని ఆమె కంటె చాలా హీనంగా ఉండేవారు. అక్క చెప్పినట్లు వినక తప్పదని ఎదుగుతున్నకొద్దీ తెలుసుకున్నారు. తమ భర్తలకు కూడా అదేపరిస్థితి అని కూడా గ్రహించుకున్నారు. రంగనాయకి నేర్పుగా చెల్లెళ్లను మంచిమాటలతో లొంగదీసుకునేది. వాళ్లకు కూడా ఆమెపట్ల గౌరవము కలిగేటట్లు మెలగేది. కాని వాళ్లు వాళ్ల మనసులోని మాట బైటపెట్టేవారుకారు.

ఆడపిల్లలిద్దరూ సరళ అమల తెలివితేటలలో సామాన్యులేగాని తెలివి హీనులుమాత్రంకాదు.

వాళ్లకు బుద్ధి తెలిసిన తరువాత - ఒక్క రోజంటే ఒక్కరోజు, ఎంతకాలం నుంచో ఎదురు చూస్తున్నరోజు వచ్చింది.

జగన్నాథరావు సాయంత్రం ఐదుగంటలు కాగానే లాన్‌లో కుర్చీవేసుకుని కూర్చుంటాడు. మరోనాలుగు కుర్చీలు ఆయనకు రెండుపక్కలా వేసే ఉంటాయి. ఎవరయినా ఆయనతో పని ఉండివస్తే కూర్చోటానికి వేస్తారు.

ఆ రోజున సురేంద్ర రంగనాయకి మహిమను తీసుకుని కారులో ఎగ్జిబిషన్ చూడటానికి వెళ్ళారు. ఎనిమిది గంటలరాత్రికిగాని రారు.

సమయం చూసుకుని సరళ అమల తమభర్తలతో లానులోకి వచ్చి తండ్రిదగ్గర కూర్చున్నారు.

"ఏమిటి ఇలా వచ్చారు ?'' అని అడిగాడు ఆశ్చర్యంతో అల్లుళ్ళు మాట్లాడ లేదు.

కాని కూతుళ్ళిద్దరూ ''నాన్నా మేము ఇంట్లో నౌకర్ల పిల్లల మాదిరిగా పెరుగుతున్నాము. ఏదిపెట్టినా తింటున్నాం. ఏదిచ్చినా కట్టుకుంటున్నాం. మా తెలివితేటలకొద్దీ చదువుకుంటున్నాము. మాకు ఇద్దరికీ బి. ఏ. అయిపోవచ్చింది. మా భర్తలిద్దరు మెట్రిక్ మాత్రమే ప్యాసయ్యారు. వాళ్ళను కూడా బి. ఏ.

వరకూ చదివిస్తే ఏదయినా చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటారు. మీ అల్లుళ్ళు మెట్రిక్ మాత్రమే చదివారంటే మీకుమాత్రం చిన్నతనంగా లేదానాన్నా ? ఇంత కాలం నుంచీ ఎక్కడ పడుకోమంటే అక్కడే పడుకున్నాం. మంచాలు సరిగా లేకపోయినా సర్దుకున్నాం. కూరలు పులుసులు లేకపోయినా పచ్చడిమెతుకులు పెట్టినా తిన్నాం. నీవరకూ రానివ్వలేదు. కాని నిన్నటినుంచీ తోటమాలిని మాన్పించి చెట్లకు నీళ్ళు పొయ్యమంటే వాళ్లకెట్లా ఉంటుంది ? ఒకరు తోడి టాంకులో పొయ్యాలి. ఇంకొకరు ట్యూబ్‌తో చెట్టు చెట్టుకూ నీళ్ళు పొయ్యాలి. మా పరీక్షలయిన తరువాత డైనింగ్ టేబుల్ క్లీన్‌చేసి కూరలు తరిగి వంటమనిషికి మేమివ్వాలట. పప్పులు మేమేబాగుచెయ్యాలట. మేము అక్కకంటె బావకంటె ఏం తక్కువని ఈ ఏర్పాటు చేశావు నాన్నా?" అమ్మాయిలిద్దరూ కన్నీళ్ళు కార్చారు.

తల్లి కంటె అక్క ఏమీ తక్కువగా చూడటంలేదనుకుని నిశ్చింతగా ఉన్నాడు ఇంతవరకూ జగన్నాధరావు. గుండె కలుక్కు మంది ఈ మాటలు వినగానే.

రంగనాయకి తన చెల్లెళ్లను మరుదులను ఇట్లా చూస్తున్నదంటే ఆయనకు నమ్మకం కుదరలేదు. పైగా అల్లుళ్లముందర చిన్నతన మనిపించింది.

"అమ్మాయిలూ ! మీ మాటలు నమ్మశక్యం కావటంలేదు. అయినా ఎన్నడు ఒకమాట నాతో అని ఎరగని మీరు ఇవాళ ఇలా అంటున్నారంటే నమ్మవలసిందే. అయినా అల్లుళ్ళచేత చెట్లకు నీళ్ళు పోయించటం భరించరాని విషయం. మీ మార్కులు చూస్తే మీచదువులు ఆపవలసిన పనికూడా లేదు. మీకేం కావాలంటే అదే చదువుకోండి" అన్నాడు ముఖాన్ని తువాలతో తుడుచుకుంటూ.

"నాన్నా, వీళ్ళిద్దరూ ఇంట్లో చెట్లకు నీళ్ళు పోస్తూఉంటే మేము చదువుకోవటమా ? అది కాని పని. మాబదులు వీళ్ళిద్దరినీ చదివించు. ఇప్పుడు బట్టలు కుట్టించుకోవటానికి ఇద్దరికీ చెరొక వెయ్యిరూపాయలివ్వు. కాలేజీలు తెరవగానే చేర్తారు. అక్కకు మాత్రం చెప్పకు. మేము తనమీద చాడీలు చెప్పామని మాపని పట్టిస్తుంది. వాళ్ళు చదువుకోవటానికి కూడా ప్రతినెలా ఇద్దరికీ చెరొక నూట ఏభయి ఇవ్వు. అదీ అక్కకు తెలియకుండా" అన్నారు.

"సరే! పెద్దగుమాస్తా చేతికిస్తాను. ఎవడికంటా పడకుండా తీసుకోమనండి" అన్నాడు ఊరడింపుగా.

రంగనాయకికి సావిత్రితోనే పోటీ. 'తనకంటె అందంగా ఉన్నానని మిడిసిపడేది. తెలివిగల దాననని సంగీతం కూడా వచ్చునని అహంకారంతో ఉండేది. ఆమెను చూస్తుంటేనే తనకు కడుపులో మంటలు రగిలేవి. తన కంటె తన భర్తకంటె సుఖపడుతోందా? ఉండటానికి ఇల్లులేక, తినటానికి తిండి లేక, ఏడుస్తూ ఉండి ఉంటుంది. ఇంటినుంచి వెళ్ళిపోయింది. ఇప్పుడు నా మనసు నిశ్చితగా ఉంది, అనుకుని సంతోషిస్తూ ఉండేది.

సరళా, అమలా, నాన్నకు తన కూతుళ్ళు, అల్లుళ్ళూ తన కంటిఎదుట ఉండాలన్నకోరిక. మనమే ఆయనకు సంతృప్తికరంగా నడుచుకుని ఆయనకు సంతోషపెట్టాలి. అంతేగాని మనలో మనము తగవులాడుకుని నాన్నను చిరాను పెట్టకూడదు. ఆ సావిత్రిని చూడండి, ఏంచేసిందో? నాన్న మనసు బాధపడేటట్టు భర్తను తీసుకుని పిల్లలతో వెళ్ళిపోయింది. అది చేతులారా కష్టాలనుకొనుక్కొచ్చు కుంది. ఆ పిల్లలతో ఆ పడిపోయే ఇంట్లో ఎట్లా ఉంటోందో? అయినా దాని కర్మ వెళ్ళిపోయింది. మీరయినా మీమీ భర్తలతో ఇక్కడ సుఖంగా ఉండండి. ఇంటి గుట్టును కాపాడి నాన్నకు పేరు తీసుకురావాలి. మీ భర్తలకు ఈమాటే చెప్పండి. మన యింట్లో మనం ఏపని చేసుకున్నా తప్పులేదు. భావను చూడండి డబ్బు ఎక్కడ తక్కువవుతుందోనని ఉద్యోగంచేసి జీతం తెచ్చి యింట్లో ఇస్తున్నాడు" అవి వాళ్ళను దగ్గర కూర్చోబెట్టుకుని నూరిపోసేది.

ఆ వయసులో ఉన్న సరళా అమలలకు ఆమె చెప్పినప్పుడు నిజమేనేమో ననిపించేది. తరువాత అనుభవంవల్ల ఒక్కొక్కటే తెలిసివచ్చేది. ఇద్దరూ కలిసి బాధపడేవారు.

రంగనాయకి తన కంటె అన్నిటిలో మించిన సావిత్రి వెళ్ళిపోయిన తరువాత తన చెల్లెళ్ళను సులభంగా చేతిలో పెట్టుకోవచ్చు, ననుకుంది. వాళ్ళకూ నౌకర్లకూ భేదంలేకుండా చేసింది.

"ఆడనౌకరు ముసలిదయిపోయింది. పని చెయ్యలేనంటోంది. ఈ నెల నుంచీ మాన్పించేస్తున్నాను. మన యింటిపని- అంటే అంట్లుతోమటంకాదు. ఇల్లు

ఊడ్చుకోవటం, బట్టలు మడత చేసుకోవటం పక్కలు వేసుకోవటం వంట పనులు రేపటినుంచే మొదలుపెడదాం'' అని మంచిమాటలతో చెప్పి పనిమనిషిని మాన్పించింది.

ఆనాటినుంచీ సరళకూ అమలకూ చేతినిండా పని తగిలింది. ఎన్నడూ పనిచేసి ఎరగని పిల్లలు. అంతపెద్ద ఇల్లు ఊడవటానికి రెండు మూడు గంటలు పట్టేది. నడుమునొప్పి అని మధ్య మధ్యన కూర్చునేది. ఒక్కొక్కరోజు పడు కునేది. సరళ, ఇల్లు కడగటానికి ఇద్దరూ బాధపడేవారు. ఒకరు నీళ్ళుతెచ్చి పోస్తుంటే ఒకరు కడిగేవారు. వంటచేసేటప్పుడు చేతులు కాల్చుకొనేవారు. వంట సరిగా కుదిరేదికావు. అక్కచేత చివాట్లు తినేవారు.

వాళ్ళిద్దరికి ఎంత కష్టపడ్డా భర్తలు చదువుకుంటున్నారుకదా అన్న సం తృప్తితో తలవంచుకుని పనిచేసేవారు. ఇద్దరూ తమ కష్టాలను ఒకరితో ఒకరు చెప్పుకుని మనసులను శాంతింపచేసుకునేవారు.

సుందరి రెండవ కూతురు ఎక్కువగా ఎవరితోను మాట్లాడేది కాదు. ఆమె దగ్గరలో ఉన్న కుట్టుపని నేర్పే సెంటర్‌కి వెళ్ళి బట్టలు కుట్టటం కత్తిరించటం నేర్చుకుంది. అక్కడికి వెళ్ళి పదిగంటల నుంచి నాలుగు గంటలవలకూ పని చేసేది. "ఇంతసేపు బయట తిరిగితే ఇంటిపని ఎవరుచేస్తారు? నౌకర్లు లేరని'' ఎగిరిపడేది అక్క. ఆమె తన మెడలో గొలుసును అమ్మి భర్తచేత చౌరస్తామీద టైప్‌రైటింగ్ ఇన్‌స్టిట్యూటీ పెట్టించింది. అక్క అనే మాటలు వినిపించుకునేది కాదు.

రంగనాయకికి ఈ సంగతి తెలిసినా మాట్లాడలేదు. కాని సుందరి దగ్గర నుంచి అప్పుడప్పుడు డబ్బుడిగి తీసుకునేది.

''సుందరీ నాన్నకు ఆదాయంకంటె ఖర్చులెక్కువయ్యాయి. అందుకే నౌకర్లను తగ్గించాను. సరళా అమలా ఇద్దరూ వంటపని ఇంటిపనులు చేస్తున్నారు. వాళ్ల భర్తలు చెట్లకు నీళ్ళుతోడి పోస్తున్నారు. మీ ఆయన కంటికే కనబడడు. తిని తిరుగుతున్నాడు. చిన్నచిన్న ఖర్చులు మనమైనా సర్దుకోవాలి'' అనేది డబ్బు చేతిలో వేసుకుని.

సుందరికి తన భర్తను అటువంటి మాటలంటున్నందుకు బాధ కలిగేది కాని తనిప్పుడేం చెయ్యలేదు.

"ఏం సుందరీ! నీ భర్తకు షోకులెక్కువయ్యాయి. మంచిడ్రెస్సులు వేసుకుని తిరుగుతున్నాడు. ఏమిటి విశేషం? ఎక్కడైనా పనిచేస్తున్నాడా?" ఆ అడిగే తీరు ఏదో చెయ్యరానిపనిచేసి సంపాదిస్తున్నట్టుగా అనిపించేది సుందరికి.

తన బావగారు సెక్రెటేరియట్‌లో యు.డి.సి. గా పనిచేస్తుంటే 'అంతటి ఉద్యోగం చెయ్యటం చేతగానివాళ్లు మిగతా వాళ్ళు! అన్నట్టుగా రోజుకు నాలుగు సార్లయినా తీసికట్టుగా మాట్లాడేది రంగనాయకి.

"అమ్మా, రంగా! మన సావిత్రి సంగతులు ఏమి తెలియటం లేదమ్మా. ఉత్తరాలు రాయదు. మనిషినిపంపించి కనుక్కోమ్మా!" అన్నాడొకరోజున జగన్నాథరావు.

ఆయన రెండు మూడు సార్లు హెచ్చరించిన తరువాత రంగనాయకి అమల భర్త ఉపేంద్రను పంపించింది.

ఉపేంద్ర రంగనాయకికి తెలియకుండానే ఇంటర్ ప్యాసయ్యాడు. అతడు బి.కామ్ చదివి బ్యాంకులో ఉద్యోగానికి ప్రయత్నించాలన్న ఊహతో ఉన్నాడు. సెలవులు కనుక రంగనాయకి కంటబడినప్పుడు పాత లుంగీ షర్టులోనే కనబడ్డాడు.

అతడి డ్రెస్సు ఆమెకు సంతృప్తిగా ఉంది. పదిరూపాయలు ఉపేంద్ర కిచ్చి సావిత్రి క్షేమసమాచారాలను తెలుసుకు రమ్మన్నది. పదిరూపాయలు రాకపోకలకు సరిపోవని తెలిసినా మాట్లాడకుండా వెళ్లాడు.

సావిత్రి ఆమెభర్త రంగారావు సాదరంగా అతడిని ఆహ్వానించారు. అందరి క్షేమసమాచారాలూ అడిగారు. అతడి సంగతిని గురించి రంగారావు అడిగాడు.

"నేనిప్పుడు ఇంటర్మీడియెటు ప్యాసయ్యాను. అయితే ఇంట్లో అందరికీ తెలియదనుకోండి. బి.కాం చదువుదామని ఉంది. బ్యాంకు ఉద్యోగం చెయ్యాలని ఉంది" అన్నాడు.

మీ అభిప్రాయం నాకు నచ్చింది. ఇల్లరికం ఎవరుంటారు ఆమె చేతికింద?

నౌకరులా చూస్తుంది. మీరు ఉద్యోగం చెయ్యాలని ఉందన్నారు కదా. ముందు బి. కామ్. ప్యాసవ్వండి. అయితే- తరువాత ఏదయినా ఉద్యోగం దొరక్కపోదు. నేనసలు ఇంజనియరింగ్ స్టూడెంటును. అప్పుడు డబ్బువసతి సరిగా లేక అది ఆపుచేసి రైల్వే సర్వీసులో చేరాను. తరువాత డబ్బుసమకూర్చుకుని ఇంజనీయ రింగ్ కోర్సు పూర్తిచేశాను. నేనిప్పుడు రైల్వే ఇంజనీరింగ్ సర్వీసులో సెలక్టు అయ్యాను. రెండేళ్ళు కావచ్చింది. నాకు ట్రాన్సరుకూడా అయింది. వారంరోజుల్లో వెళ్ళిపోతాను". అన్నాడు రంగారావు-

''చాలా సంతోషం. మన తోడల్లుడు సర్వేశ్వరావుకూడా ఇంటర్‌ప్యాస య్యాడు. ఆ సంగతికూడా ఎవరికీ తెలియదనుకోండి. మాకిద్దరికీ ఎక్కడైనా ఉద్యోగాలు చేయాలని ఉంది. సుందరిగారి భర్త టైప్‌రైటింగ్ ఇన్‌స్టిట్యూట్ పెట్టు కున్నారు ఆ ఊళ్ళోనే. ఆ సంగతికూడా ఎవరికీ ఇంకా తెలియదనుకోండి. అబ్బ! ఆ నరకంలో తెలియక పడ్డామనుకోండి.'' అన్నాడు ఉపేంద్ర.

"మీరు ఇంటరే ప్యాసయ్యామని చెబుతున్నారు. ఇక్కడ మా డిపార్టుమెం టులో ఏదయినా ఉద్యోగాలిప్పించగలను. కాని చిన్న ఉద్యోగాలు గ్రాడ్యుయేట్లయితే ఇంకా కొంచెం పెద్ద ఉద్యోగం రావచ్చు. మీరిద్దరూ ఈ లోపల టైపు రైటింగ్ షార్టుహాండ్ కూడా నేర్చుకోండి'' అన్నాడు రంగారావు. అతడికీ రంగ నాయకి పెత్తనము చేస్తున్న ఇంట్లో అయిన అనుభవాలు జ్ఞాపకం వచ్చాయి.

''సరేనండి. నాకు మీక్షేమం కనుక్కొని వెంటనే రమ్మని మాత్రమే చెప్పారు. రేపు ఉదయం ఆరుగంటల బండిలో వెళ్తాను'' అన్నాడు.

''మంచిది కాని బాగానే ఉన్నారని చెప్పండి. నా ఉద్యోగం ట్రాన్సర్ సంగతి చెప్పకండి'' అన్నాడు రంగారావు.

ఉపేంద్ర రంగనాయకి చెప్పిన వేళకు వెళ్లాడు. బాగున్నారన్న కబురు చెప్పాడు. తన తోడల్లుడితోటి రంగారావు చెప్పిన ప్లానంతా వివరించాడు.

భార్యలు కష్టపడుతున్నారన్న బాధతో ఇద్దరూ ఒకరు బి. ఏ. ఒకరు బి.కామ్. ప్యాసయ్యారు. 'సాయంత్రపు వేళల్లో షార్ట్‌హాండ్ టైప్‌రైటింగ్ హైయ్యర్‌గ్రేడు ప్యాసయ్యారు.

మేడదిగని రంగనాయకికి కింద ఏంజరుగుతున్నదో తెలియదు. పనులు

యధావిధిగా జరుగుతున్నాయని మాత్రం తెలుసు. తండ్రికి ఇంటివిషయాలను గురించి బాగా కల్పించి చెప్పేది.

ఆమె చెప్పిన మరునాడు జగన్నాధరావు తండ్రి కాలం నుంచీ పొలాల పనులు చేసే రైతుకోడుకు వచ్చాడు.

''అయ్యగారూ ! తమరు డబ్బుకావాలని అల్లుడిగారిని రెండుసార్లు వంపి నారు. ఇది డబ్బు ఇచ్చేరోజులు కావని చెప్పినాము. ఈ దినం మళ్ళీ వచ్చినారు. తాము ఎప్పుడూ ఇట్లా అడిగినవారు కాదు. ఏమవసరం వచ్చిందోనని డబ్బుఇచ్చి మా అయ్య తెలుసుకురమ్మన్నాడు'' అని చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

''నేను డబ్బుకు పంపలేదే? వచ్చినవారెవరు?'' పడక్కుర్చీలో పడుకున్న వాడు లేచి కూర్చున్నాడు జగన్నాధరావు.

"మన అల్లుడిగారటండి"

"పేరు ?

"పెద్దల్లుడుగారటండి"

"నేను మధ్యలో ఎప్పుడూ మిమ్మల్ని డబ్బివ్వమని అడుగలేదు. ఎప్పుడూ ఇచ్చే రోజునే ఇవ్వండి. నా సంతకం ఉండాలి. నేను పంపాలి గాని ఎవరు వచ్చినా ఇవ్వవద్దని" జగన్నాథరావు చెప్పిపంపాడు గట్టిగా.

జగన్నాథరావుకు అనారోగ్యమేమీలేదు- కొంచెం వయసు పైన బడుతున్న దంతే. పెత్తనమంతా కూతురికి ఒప్పచెప్పి తను ఉదయం సాయంత్రం వాకింగ్‌కు వెళ్తాడు. ఉదయపువేళ చన్నీళ్ల స్నానంచేసి సూర్యనమస్కారాలు చేస్తాడు. ఆయన గది కుర్చీలు వేసిన గదిపక్కగా ఉన్నది. ఆయనకు ఏది కావల సినా తీసుకువచ్చి ఇవ్వటానికి నౌకరు ఆశయ్య ఉన్నాడు. ఆయన గదికి ఎదు రుగా అల్లుళ్లగదులు నాలుగు ఉన్నాయి. ఆయన ప్రత్యేకంగా పిలిస్తేతప్ప అల్లుళ్ల కనబడరు. కూతుళ్లు అంతకంటె కనబడరు. రంగనాయకిమాత్రం తండ్రి మేలు కుని ఉన్నప్పుడు ఆయన గదిలోకి వెళ్లుతుంది.

చూస్తూ ఉండగానే రెండేళ్ళు గడిచిపోయాయి.

మధ్యాహ్నంవేళ జగన్నాథరావుగారు లేవగానే ఆఖరి అల్లుళ్లిద్దరూ ఆయన కెదురుగా నిలబడి తమ సర్టిఫికెట్లను చూపించారు.

''మీరు ఇంత తెలివిగలవాళ్లని నేననుకోలేదు. మీరు చదువుకున్నారు. కనుక ఏవయినా ఉద్యోగాలు వెతుక్కోండి. మీరంతా నా కళ్లముందర ఉండాలని ఆశ తప్ప మరేమీలేదు'' అన్నాడు సంతోషంతో.

"మా తల్లిదండ్రులను ఒకసారి చూడాలనిఉంది. చూసివస్తామండి. మేము ఎక్కువరోజులు ఉండమని" ఇద్దరూ అన్నారు.

"దానికేమి? వెళ్ళిరండి. కన్నవారినిచూసి రావలసిందే"నని రెండేసి వందల రూపాయలు ఇచ్చి పంపాడు.

ఇద్దరూ తిన్నగా రంగారావు దగ్గరికి వెళ్లారు. అవి పెద్ద ఉద్యోగాలకు పోటీ పరీక్షలు నడిపేరోజులు. వాళ్లు అన్ని ఉద్యోగాలకూ పోటీచేశారు. ఫలితాలు పేపర్లలో వస్తాయని తెలియగానే తల్లిదండ్రులను ఒకపూటచూసి ఉద్యోగాలు రాగానే మళ్లీ వస్తామనిచెప్పి జగన్నాథరావుతో తల్లిదండ్రులను మాత్రమే చూసినట్టు చెప్పారు.

నెలరోజులు కాగానే ఇంట్లో అదివరకు ఎరగని విషయమొకటి జరిగింది. పెట్రోలు బంకువాడు రెండువేల రూపాయల బిల్లు తెచ్చాడు.

"కారు నేను ప్రతిరోజూ వాడటంలేదు. ఇంత బిల్లు ఎట్లా అయింది?"

''అయ్యా! కారు రెండురోజులకొకసారి వచ్చి పెట్రోలు పోయించుకుని పోతునే ఉంది. ఒక్కోసారి రాత్రిళ్లకూడా వస్తుంది పెట్రోలుకు.''

"సరే బిల్లు ఇచ్చివెళ్ళు. నేను తెలుసుకుని పంపుతానులే'' అతడిని పంపించాడు.

రంగనాయకి మామూలుగా వచ్చినట్టు తండ్రి గదిలోకి వచ్చింది.

ఆమె రాగానే కూర్చోమని చెప్పి బిల్లు చేతికిచ్చాడు.

ఆమె దానిని ఇటూ అటూ తిప్పిచూసి ''నాన్నా మన వర్తకులు ఎన్నడూ ఇటువంటి పని చేయలేదు. మన ఇంట్లోనే ఏదో జరిగి ఉంటుంది. దీని సంగతి

బాగా ఆలోచించాలి. మనం సామాన్లు తెచ్చుకునే దుకాణంనుంచికూడా ఒకనెల సామాన్ల బిల్లు అదనంగా వచ్చింది. ఇదేమిటో నీ ముగ్గురల్లుళ్లను నిలవదీసి అడుగుతానని నీకు చెప్పటానికే వచ్చానునాన్న" అన్నది.

"సరే నేను కనుక్కుంటానుగాని సుందరి, సరళ, అమల బాగానే ఉన్నారు కదా. ఈ మధ్య వాళ్లను చూడలేదు".

''బాగానే ఉన్నారు. కాని కొద్దిగా బద్ధకస్థులు. పగలంతా పడుకుని నిద్రపోవటం తినటం, వాళ్ళపిల్లలను చూసుకోవటం. ఇదే సరిపోతుంది వాళ్ళకు. అంతేగాని పెద్దవారు నాన్న ఉన్నారు ఒకసారి ఆయనకు కనబడదామని లేదు. ఏం చేస్తాం. అనవసరంగా బి.ఏ. లు చదివించావు'' అన్నది.

''ఏదో అయిపోయింద"ని ఆయన నీరసంగా అన్నాడు.

ఇది జరిగిన రెండునెలలకు బి.కామ్ చదివిన అల్లుడు బాంకు క్లార్కుగా సెలక్టయినట్టు తెలిసింది. మరోవారం రోజులకు బి.ఏ. ప్యాసయిన అల్లుడు తహసీల్దారుగా సెలక్టు అయినట్టు ఆర్డరు వచ్చింది.

ఇవి మామగారికి చూపించాలా వద్దా అని ఆలోచిస్తూ ఉండగా రైతులు "అయ్యగారూ మేమూ పిల్లలు గలవాళ్ళం. పెద్ద పిల్లకు సంబంధం కుదిరింది. వచ్చేనెలలో పెళ్లి. అల్లుడుగారు తీసుకున్నడబ్బు పోను మిగతా డబ్బు తెచ్చాము" అని వడ్లబస్తాలు మిగతాడబ్బు తెచ్చారు.

జగన్నాథరావు డబ్బు లెక్కచూసుకోగా ఐదువేల రూపాయలు రైతులు పట్టుకున్నారు.

ఇంకా రెండువేలరూపాయలు పెట్రోలు బంకుకు కట్టాలి.

ఆయనకూ చాలా బాధ కలిగింది. తల్లిపోయిన తరువాత ఇంటికి పెద్దపిల్ల కనుక చెల్లెళ్ళను బాగా చూస్తుందనీ సంసారాన్ని తీర్చిదిద్దుతుందనీ ఆశించాడు. మంచి కుటుంబంలోనుంచి కోరి చదువుకున్న పిల్లవాడిని తీసుకువచ్చి పెళ్ళి చేశాడు. సెక్రెటేరియట్‌లో ఉద్యోగం చేసుకుంటున్నాడని సంతోషించాడు. పెద్ద అల్లుడూ పెద్దకూతురూ బాధ్యతతో సంసారాన్ని నిర్వహిస్తారని కొండంత ఆశతో

ఉన్నాడు. ఆడపిల్లలను అత్తవారిళ్ళకు పంపకుండా అల్లుళ్ళను ఇంటికే తెచ్చుకున్నాడు.

కాని తను విన్న విషయాలు, అనుభవంలోకి వచ్చిన అంశాలు తన ఆశయానికి భిన్నంగా ఉన్నాయి.

ఇప్పుడు చేయవలసిందేమిటి ?

ఈ మాదిరిగా జరుగుతుంటే పొలం అమ్మవలసి వస్తుంది. కొంతకాలానికి ఇల్లుకూడా అమ్మేదశకు వస్తుంది. ప్రస్తుతం కారు అమ్మకానికి పెట్టాడు.

ఆ సాయంత్రం అల్లుళ్లిద్దరూ వచ్చి తమకు ఉద్యోగాలు వచ్చినట్టు చెప్పారు. సుందరి భర్త సంగతికూడా చెప్పారు.

"మీరింతటి వాళ్లయినందుకు నాకు పట్టలేనంతగా సంతోషం కలుగుతోంది. ఆర్డర్లుచూస్తే చేరటానికి వారమే టైమిచ్చారు. మీరు వెళ్లితే అమ్మాయిలుకూడా మీవెంటవస్తారు. నేను పిల్లలను చూడనిదీ ఉండలేను'' ఆయన కళ్లు చెమ్మగిల్లాయి.

కొంతసేపటికి సర్దుకుని ''ఉద్యోగాలలోచేరి ఇల్లూ వాకిలీ చూసుకుని అమ్మాయిలను తీసుకువెళ్లండి. వాళ్ళు ఇక్కడ ఉండిమాత్రం ఏం సుఖపడుతున్నారు" అన్నాడు తలవంచుకుని.

"మేము అందరం కలిసేవెళ్తాం. మళ్లీ రావాలంటే రైలు చార్జీలకు డబ్బు ఖర్చు. ఇల్లు కుదిరేవరకూ ఏ సత్రంలోనో ఉంటామని మరునాడే బయలుదేరారు పిల్లలతో.

వాళ్ళు వెళ్లిన తరువాత సుందరి తమ ఇన్‌స్టిట్యూట్‌లో తాను ఉండి భర్తను పై చదువులకు ప్రోత్సహించింది.

రంగనాయకి రెండురోజులు తండ్రిని చూడటానికి కిందికి దిగిరాలేదు. తన భర్త చేసిన పనులు ఆమెకూ తెలుసు. కాని ఏమీ చేయలేకపోయింది. అతడిని సుఖపడనీ అనుకుందిగాని అదొక వ్యసనంగామారి రాత్రిళ్ళు ఇంటికిరాక తాగుడుకికూడా అలవాటు పడ్డాడని విచారపడ్డది.

అతడిప్పుడు ఒకరుచెప్పినమాటవిని తన జీవితాన్ని బాగుచేసుకునే స్థితిలో లేడు. భార్య మెడలోని నగలుకూడా ఖర్చయ్యాయి.

తండ్రికి తన ముఖం ఏమని చూపిస్తుంది?

జగన్నాథరావు రంగనాయకిని పిలిచి "రంగా! నీవు పెద్దదానవనుకుని చెల్లెళ్లను బాగా చూస్తావనుకుంటే అది నెరవేరలేదు. నీ భర్తా నీవూ ఈ సంసారాన్ని నిర్వహిస్తూ పిల్లలకు పెళ్లిచేసి తల్లిలా చూస్తావనుకుంటే అదీ నెరవేరలేదు. సుందరికూడా వేరే కాపరం పెట్టిందని ఇవాళే తెలిసింది. చిన్నపిల్లలచేత ఇంటి చాకిరీ అంతా చేయించావని వాళ్ళు నాముందుకొచ్చి ఏడ్చారు. నౌకర్లయినా సుఖపడ్డారా అంటే వాళ్లను ఒక్కొక్కళ్లనూ తొలగించి అల్లుళ్ళను తోటకు నీళ్ళుపట్టమన్నావు. నేను, పిల్లలు నా కళ్ళముందర ఉంటే చూసి సంతోషించాలనుకున్నాను. కాని వాళ్ళు బాధలు పడుతూ ఉండగాకాదు.

ఇప్పుడు పిల్లలు కంటతడిపెడుతూ గడపదాటటం కళ్లతో చూశాను. అందరూ వెళ్ళిపోయిన తరువాత నీవూ నీకుటుంబమూ సుఖంగా ఉందామనుకున్నావా? నీ భర్త ఈ యింటికి వచ్చి ఎన్నాళ్లయింది?'' ఆమె ముఖంలోకి చూశాడు.

వాళ్లందరు ఇంట్లో ఉండి తనతో సమానంగా సుఖపడటం తను చూడలేకపోయిందని నోటితో చెప్పలేకపోయింది రంగనాయకి. నోటినుంచి మాట రాలేదు.

''నన్ను ఏమార్చి ఇల్లూ, పొలమూ నాచేత మీ పేర రాయించుకోవటానికి ప్రయత్నిస్తున్నారనికూడా తెలిసింది. నీవు ఒక్కదానవూ ఇంత దుర్మార్గానికి ఒడిగట్టవని నాకు తెలుసు! అమ్మనగలు ఇనప్పెట్టెలో లేవు. ఏంచేశావు? నీ ఒక్కదానికీ కావవి. నలుగురికీ పంచియిద్దామనుకున్నాను నీ చెల్లెళ్లంటే నీకూ ప్రేమ ఉందని తెలుసు. మరెందుకు ఇట్లా జరిగింది? చెప్పు?''

నేను సావిత్రినిచూసి ఓర్వలేకపోయానని తండ్రికి చెబుతుందా? తన పెనిమిటితోపాటు చెల్లెళ్ల భర్తలుకూడా ఉండటం ఇష్టంలేదని చెబుతుందా? తన భర్త బలవంతముమీదతల్లి నగలమ్మానని అనగలదా? తనే చెల్లెళ్ల భర్తలతో ఇంట్లో

నించి వెళ్ళిపోయేటట్టు చేసిందని చెప్పగలదా ? ఇదంతా తన స్వార్థమని విప్పి చెప్పగలుగుతుందా ?

ఆమె కట్టెలా ఆయన ముందర నిలబడిపోయింది.

ఆయన ముఖంచూస్తే కందగడ్డలా ఉంది. ఏం చేయటానికయినా సిద్ధపడేలా ఉంది.

కాని - ఏమీ చేయలేదు.